సాక్షి
కామారెడ్డి

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



మాతుసంగం వాగులో రైతు సంగయ్య చిక్కుకున్న షెడ్డు

దంచికొట్టిన వాన



పొంగి పొర్లుతున్న గాంధారి వాగు

- పొంగి ప్రవహిస్తున్న వాగులు
- నీట మునిగిన పంట పొలాలు
- ప్రాజెక్టుల్లోకి భారీగా వచ్చి చేరుతున్న వరద నీరు
- గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్న అధికారులు
- మరో రెండు రోజులు వర్ష సూచన

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం ఉదయం వరకు సదాశివనగర్, గాంధారి మండలాల్లో 11 సెం.మీ., జుక్కల్‌లో 10 సెం.మీ. వర్షపాతం నమోదైంది. దాదాపు జిల్లా అంతటా భారీ వర్షాలు కురిశాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు గాంధారిలో 10 సెం.మీ. వర్షం కురిసింది. చాలా ప్రాంతాలలో 5 సెంటీమీటర్లపైనే వర్షపాతం నమోదైంది. జిల్లా అంతటా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించింది. పొద్దంతా వర్షాలు కురవడంతో ఇళ్లకే పరిమితమయ్యారు.

వాగుల్లో వరద ఉధృతి..

భారీ వర్షాలతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. జూలైలో కురిసిన భారీ వర్షాలతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులన్నీ నిండి ఉన్నాయి. ఆగస్టులో భారీ వర్షాలు లేకపోయినా.. వాగుల్లో నీరుంది. ఆది, సోమవారాల్లో కురిసిన వర్షాలతో వాగుల్లో ప్రవాహం పోటెత్తింది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టుతోపాటు కల్యాణి, పోచారం, కౌలాస్ ప్రాజెక్టులూ పరవళ్లు తొక్కుతున్నాయి. గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. మంజీర నదితో పాటు భీమేశ్వర వాగు, పల్వంచ వాగు, పెద్దవాగు, లెండి వాగు, మొండి వాగు, గంగమ్మ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

పొలాల్లోకి వరద నీరు..

వాగుల ప్రవాహంతో చాలా మండలాల్లో పంటలు నీట మునిగాయి. వేలాది ఎకరాల్లోని పంటల్లోకి నీరు వచ్చి చేరింది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఆరెంజ్ అలర్ట్ చేశారు. వర్షాలు కొనసాగనుండడంతో పంటలు నీట మునిగిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిలిచిపోయిన రాకపోకలు

జిల్లాలోని పలు రూట్లలో వాగులు పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొండాపూర్-గుండారం మధ్య వాగులు పొంగడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. గాంధారి-బాన్సువాడ ప్రధాన రహదారిపైనున్న వాగులు పొంగడంతో ఈ మార్గంలోనూ వాహనదారులు ఇబ్బంది పడ్డారు. తాడ్వాయి మండలంలోని బ్రాహ్మణపల్లి వాగు ప్రవాహంతో నాలుగైదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

వాగవతల చిక్కుకున్న రైతులు



పెద్దవాగు అవతలివైపు చిక్కుకున్న రైతులు

లింగంపేట: పర్మళ్ల గ్రామానికి చెందిన ముగ్గు రు రైతులు సోమవారం పెద్దవాగు అవతలి వైపు చిక్కుకున్నారు. రైతులు రోజులాగే వాగవతలివైపు ఉన్న పొలాలకు వెళ్లారు. భారీ వర్షం కారణంగా వాగు ఉప్పొంగడంతో ఇటువైపు రాలేకపోయారు. రాత్రి వరద ఉధృతి తగ్గిన తర్వాత సురక్షితంగా ఇళ్లకు చేరుకున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కామారెడ్డి క్రైం: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని, ప్రాజెక్టులనుంచి నీటిని విడుదల చేస్తున్నందున పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పాటిల్ సూచించారు. నీటి ఉధృతికి కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నందున వాగులు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. సోమవారం గాంధారి మండలం మాతుసంగెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వాగు మధ్యలో చిక్కుకుపోతే అతి కష్టం మీద రక్షించామన్నారు. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలంటే లోతట్టు ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



ఆనందంగా బయటకు వస్తున్న సంగయ్య, చిరునవ్వులు చిందిస్తున్న ఎమ్మెల్యే సురేందర్

ఆరు గంటలపాటు బిక్కుబిక్కుమంటూ..

- పొలానికి వెళ్లి వాగులో చిక్కుకున్న రైతు
- పోలీసులకు సమాచారం
- బోట్ తెప్పించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చిన ఎమ్మెల్యే, అధికారులు
- ఆపరేషన్ సంగయ్య సక్సెస్‌తో ఊపిరి పీల్చుకున్న గ్రామస్తులు

సాక్షి, కామారెడ్డి: పొలం వద్దకు వెళ్లిన సమయంలో వాగు ప్రవాహం పెరగడంతో మధ్యలో చిక్కుకుపోయిన రైతు.. సుమారు ఆరు గంటల పాటు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని క్షణమొక యుగంలా బిక్కుబిక్కుమంటూ గడిపాడు. ఎమ్మెల్యే, అధికారులు కలిసి అలీసాగర్‌నుంచి బోటు తెప్పించి, రైతును సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.

మాతుసంగెం గ్రామానికి చెందిన రైతు గౌరి సంగయ్య సోమవారం ఉదయం పెద్ద వాగు ఇవతల ఉన్న తన పొలం వద్దకు వెళ్లాడు. పొలాన్ని చూసి వెనుదిరిగేంతలోపే వాగు ప్రవాహం పెరిగి, ఒక పాయ ఆయన ఉన్న ప్రాంతాన్ని చుట్టేసింది. దీంతో అక్కడ మట్టి దిబ్బపై ఉన్న రేకుల షెడ్డు వద్దకు చేరాడు. నీటి ప్రవాహం పెరిగినా తను నీళ్లల్లో మునగకుండా ఉండేందుకు అక్కడున్న మంచాన్ని పైకి లేపి షెడ్డు కర్రలకు వేలాడదీశాడు. మంచంపైకి ఎక్కి ఫోన్ ద్వారా గ్రామస్తులు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు.

డయల్ 100 కు కాల్..

విషయం తెలుసుకున్న గ్రామస్తులు వాగు వద్దకు చేరుకున్నారు. వాగు ఉధృతంగా పారుతుండడంతో రేకుల షెడ్డు వద్దకు వెళ్లి సంగయ్యను తీసుకురావడానికి ధైర్యం చేయలేకపోయారు. దీంతో సంగయ్య కుమారుడు శ్రావణ్ వెంటనే డయల్ 100 కు కాల్ చేసి విషయం చెప్పాడు. దీంతో పోలీసు లు, రెవెన్యూ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. వరద తగ్గకపోగా మరింత పెరగడంతో సంగయ్యకు ఫోన్ చేస్తూ ధైర్యం చెబుతూ వచ్చారు.

సమీక్షించిన ఎమ్మెల్యే, కలెక్టర్



పరిస్థితిని సమీక్షిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ఎల్లారెడ్డిలో బీసీ కులాల లబ్ధిదారులకు లక్ష సాయం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఉన్న ఎమ్మెల్యే జాజాల సురేందర్, కలెక్టర్ జితేష్ వి పాటిల్‌లకు అధికారులు సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈతగాళ్లను పంపించేందుకు అనువైన పరిస్థితి లేకపోవడంతో అక్కడే ఉండి సమాలోచనలు చేశారు. ఎమ్మెల్యే మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పగా.. ఆయన స్పందించి అలీసాగర్‌నుంచి బోట్ పంపిస్తానని చెప్పారు. మధ్యాహ్నం 3.30 గంటలకు బోట్ చేరుకుంది. బోటులో ఎమ్మెల్యే సురేందర్‌తో పాటు పలువురు సంగయ్య ఉన్న చోటుకు వెళ్లి ఆయనను క్షేమంగా 4 గంటల ప్రాంతంలో ఇవతలి ఒడ్డుకు తీసుకువచ్చారు. అప్పటి వరకు ఆందోళన చెందిన సంగయ్య కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఆపదలో ఆదుకున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో సోమవారం ఉదయం 8.30 గంటల వరకు నమోదైన వర్షపాతం..

మండలం	వర్షపాతం (మి.మీ.లలో)	మండలం	వర్షపాతం	మండలం	వర్షపాతం
		మాచారెడ్డి	77.3	నిజాంసాగర్	60.7
		మద్నూర్	74.8	నస్రుల్లాబాద్	60.2
సదాశివనగర్	116.7	కామారెడ్డి	72.9	పల్వంచ	54.3
గాంధారి	113.1	పెద్దకొడప్‌గల్	70.5	లింగంపేట్	54.0
జుక్కల్	100.6	డోంగ్లీ	69.5	ఎల్లారెడ్డి	51.8
రామారెడ్డి	96.6	బీర్కూర్	63.5	పిట్లం	50.2
బాన్సువాడ	95.2	రాజంపేట్	62.2	దోమకొండ	47.6
తాడ్వాయి	89.0	బీబీపేట్	60.8	నాగిరెడ్డిపేట్	41.7
బిచ్కుంద	79.3	భిక్కనూరు	60.8		



గాంధారి వాగు సమీపంలోని కాలనీలో నిలిచిన వరద నీరు



నాగారం వంతెనపైనుంచి పారుతున్న నీరు



వరద ఉధృతితో కొట్టుకుపోయిన నాగారం వంతెన ఒడ్డు



అలుగు పారుతున్న పోచారం ప్రాజెక్టు

పోచారం ప్రాజెక్టుకు పోటెత్తిన వరద

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. సోమవారం 36,109 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు అలుగుపై నుంచి 3.5 ఫీట్ల ఎత్తులో నీరు ప్రవహిస్తూ మంజీర ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి చేరుతోంది.

కల్యాణిలోకి..

ఎల్లారెడ్డిరూరల్: కల్యాణి ప్రాజెక్టులోకి 3 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో మూడు వరద గేట్లను ఎత్తి అంతే నీటిని మంజీర నదిలోకి వదులుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు.

ప్రాజెక్టు సమాచారం..

నిజాంసాగర్‌లోకి భారీ ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురిసిన కుండపోత వర్షాల కారణంగా నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. సోమవారం 40 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని అధికారులు తెలిపారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో దంచికట్టిన వానలకు ఘనపురం ఆనకట్ట, హల్దీవాగు 10 వేల క్యూసెక్కుల నీరు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వస్తోందన్నారు. పోచారం ప్రాజెక్టులో అలుగు పారుతుండడంతో ఆ ప్రాజెక్టు ద్వారా 30 వేల క్యూసెక్కుల నీరు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోందన్నారు. నిజాంసాగర్ నిండుకుండలా ఉండడంతో ప్రాజెక్టు 2, 3, 6, 8, 10 నంబర్ల గేట్లను ఎత్తి 30 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదుతున్నామని తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా.. సోమవారం సాయంత్రానికి 1,404 అడుగుల(16.930 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

'కౌలాస్'లోకి 5,624 క్యూసెక్కులు..

ఎగువ ప్రాంతంలోని ఏడూర్ ప్రాజెక్టు, సోపూర్ ఆనకట్టల ద్వారా జుక్కల్ మండలంలోని కౌలాస్ ప్రాజెక్టులోకి సోమవారం 5,624 క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో కౌలాస్ ప్రాజెక్టు రెండు వరద గేట్లను ఎత్తి 5,016 క్యూసెక్కుల నీటిని దిగువనకు విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు ఏఈ రవిశంకర్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 458 మీటర్లు(1.237 టీఎంసీ) కాగా.. సోమవారం సాయంత్రానికి 457.65 మీటర్ల (1.152 టీఎంసీ) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

పొంగిపొర్లుతున్న సింగితం

వర్ని, బాన్సువాడ, నిజాంసాగర్ మండలాల్లో కురిసిన వర్షాలతో సింగితం రిజర్వాయర్ లోకి 8,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. రిజర్వాయర్ నిండుకుండలా ఉండడంతో వస్తున్న వరద నీరు అలుగుపైనుంచి దిగువకు పొంగిపొర్లుతోంది.



- రైతులు ఆందోళన చెందవద్దు
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

అర్హులందరికీ రుణమాఫీ

కామారెడ్డి క్రైం: అర్హులైన రైతులందరికీ ఈనెలాఖరులోగా రుణమాఫీ డబ్బులు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. సోమవారం ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రుణమాఫీ, తదితర అంశాలపై పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్యాంకు అకౌంట్లు రద్దు చేసుకోవడం, వినియోగంలో లేకపోవడం వంటి కారణాల వల్ల సుమారు 1.60 లక్షల మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ కాలేదన్నారు. రైతుల బ్యాంకు అకౌంట్‌లకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయించి 95,845 మందికి రైతుబంధు ఖాతాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వారి ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు త్వరలోనే జమ చేస్తామన్నారు. మిగతా వారికి రుణమాఫీ కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపించాలని కలెక్టర్లకు సూచించారు. వీసీలో కలెక్టర్ పాటిల్ మాట్లాడుతూ ఆసరా పెన్షన్ పొందుతున్నవారు మృతి చెందితే వారి జీవిత భాగస్వామికి పెన్షన్ మంజూరు చేసేలా చూస్తామన్నారు. గృహలక్ష్మి పథకం కింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు ఆర్థిక సహాయం మంజూ రయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా జీవో 59 కింద వారంలో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ పూరయ్యేలా చూస్తామన్నారు. వీసీలో దేవాదాయ శాఖ మంత్రి ఏ.ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, జిల్లా అదనపు కలెక్టర్లు మనుచౌదరి, చంద్రమోహన్, జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్, డీఆర్‌డీవో సాయన్న, డీఏవో భాగ్యలక్ష్మి, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు



పౌష్టికాహారం అందించాలి

కామారెడ్డి క్రైం: గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ సూచించారు. పోషణ మాసోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ సకాలంలో ఇమ్యూనైజేషన్ జరిగేలా చూడాలన్నారు. రక్తహీనతపై పాఠశాలస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పిల్లల ఎత్తు, బరువులు పరీక్షించి తీవ్ర పోషక లోపం ఉన్న పిల్లలు, వయసుకు తగ్గ ఎత్తు, బరువు లోపంతో ఉన్న పిల్లలను గుర్తించాలన్నారు. పిల్లలు గుడ్లు, బాలామృతం తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బేటీ బచావో బేటీ పడావోను సమర్థవంతంగా అమలు చేయడానికి కార్యాచరణ రూపొందించాలన్నారు. రక్తహీనత, పౌష్టికాహారంపై మహిళా శిశు సంక్షేమ శాఖ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మనుచౌదరి, డీఆర్‌డీవో సాయన్న, అధికారులు బావయ్య, లక్ష్మణ్‌సింగ్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కుమార్, నవీన్, రమేష్ బాబు, షహీన్ బేగం పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'పోస్టర్లు, వీడియోలు రూపొందించాలి'

కామారెడ్డి క్రైం: ఓటరు నమోదును ప్రోత్సహించడానికి ప్రజలు తమ సృజనాత్మకతతో పోస్టర్‌లు, చిన్ననిడివి గల వీడియోలను రూపొందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. వాటిని ఈనెల 16వ తేదీలోగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి పేరిట పంపించాలని ఓ ప్రకటనలో తెలిపారు. పౌరులు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తెలుసుకుని, అవసరమైనవారు ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించడానికి సులభంగా అర్థమయ్యే రీతిలో రూపొందించిన పోస్టర్, 60 సెకండ్ల నిడివి గల వీడియోలకు ఎంట్రీలను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూలలో ఏ భాషలోనైనా పోస్టర్, వీడియో రూపొందించి పంపవచ్చని, విజేతలకు రూ. 20 వేల నగదు బహుమతి అందిస్తామని పేర్కొన్నారు.

హోంమంత్రిని కలిసిన ఎంపీ అర్వింద్



సుభాష్‌నగర్ : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను ఎంపీ అర్వింద్ ధర్మపురి ఢిల్లీలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ క్లీన్‌స్వీప్ కోసం వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. ఎంపీకి అమిత్ షా కీలకమైన సలహాలు, సూచనలు చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఎంపీ అర్వింద్ వివరించారు. అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేశారు.

7వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన

నిజామాబాద్ అర్బన్ : పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఎంసెట్ బైపీసీ విభాగం విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్లాట్ బుక్ చేసుకున్న 400 మంది విద్యార్థులకు కౌన్సెలింగ్ చేసి, సర్టిఫికెట్లు పరిశీలన నిర్వహించారు. ఈనెల 7వ తేదీ వరకు ధృవపత్రాల పరిశీలన నిర్వహిస్తామని, అనంతరం విద్యార్థులు కళాశాలలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

మెడికల్ కళాశాలలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు

నిజామాబాద్ నాగారం : ప్రభుత్వ మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టుల భర్తీకి ఈనెల 6 నుంచి 12 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇందిర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న అదనపు కలెక్టర్ కార్యాలయంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా 5 ఉన్నాయని, ఎండీ, ఎంస్, బీఎస్‌బీ పీజీ, ఎనిమిదేళ్ల అనుభవం ఉండాలని, వేతనం రూ.1.50లక్షల పైన ఉంటుందన్నారు. అ.ప్రొఫెసర్ పోస్టులు ఖాళీలు 5 ఉన్నాయని, ఎండీ,ఎంఎస్, డీఎన్‌బీ పీజీ కోర్సు, ఒక ఏడాది సీనియర్ రెసిడెన్సీగా అనుభవం ఉండాలని, వేతనం రూ. 1,25,000 ఉంటుందన్నారు. జూ.రెసిడెంట్ పోస్టులు 18 ఖాళీ లు, అర్హతలు ఎంబీబీఎస్ డిగ్రీతో పాటు మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ అయి ఉండాలని, వేతనం రూ.37,284 ఉందన్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 7 ఉండగా, ఎంబీబీఎస్ డిగ్రీతోపాటు ప్రభు త్వ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలి. వేతనం రూ.52,000 ఉందన్నారు. ట్యూట ర్ల పోస్టులు 14 ఖాళీగా ఉండగా వేతనం రూ.55,000 ఉంటుందన్నారు.

గోమాతకు వైద్యసేవలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నగరంలోని వినాయక్‌నగర్ అభయాంజనేయ స్వామి ఆలయం సమీపంలో అపస్మారక స్థితిలో ఉన్న ఆవు దూడకు విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి ధాత్రిక రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం సేవలందించారు. పశువైద్యులు శ్రీనివాస్, నవీన్‌ను పిలిపించిన రమేశ్ దూడ గాయాలకు తగిన విధంగా చికిత్స చేయించారు. అనంతరం దూడకు మేతను వేశారు. దీంతో దూడ కోలుకుంది. ఈ కార్యక్రమంలో హిందూవాహిని ప్రతినిధి అర్జున్‌రెడ్డి, గోసేవకులు ప్రణవ్, సాకేత్, రాజు యాదవ్, సందీప్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అల్జాపూర్ శివారులో చిరుత సంచారం



నవీపేట: మండలంలోని అల్జాపూర్ శివారులో ఆదివారం రాత్రి చిరుత కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. రెండు సార్లు చిరుత కనిపించడంతో గ్రామస్తులు అటవీశాఖ అధికారులు సమాచారమివ్వడంతో సోమవారం చిరుత సంచరించిన ప్రదేశాన్ని సందర్శించారు. అటవీశాఖ నిజామబాద్ రేంజ్ ఆఫీసర్ పద్మారావు, సెక్షన్ ఆఫీసర్ జెహ్రా ఆధ్వర్యంలో ఫారెస్ట్ అధికారులు పాదముద్రలను సేకరించారు. వయసు పైబడిన చిరుత సంచరిస్తున్నట్లు వారు నిర్ధారించారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాక బోను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏడాది క్రితం ఇదే ప్రదేశంలో చిరుత కనిపించడంతో అటవీశాఖ అధికారులు బోను ఏర్పాటు చేయగా చిరుత చిక్కలేదు.

బదిలీలు చేపట్టాలని వినతి



ఖలీల్‌వాడి: ప్రొహిబిషన్, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ బదిలీలు చేపట్టాలని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ భోజన్న, ప్రెస్ సెక్రెటరీ ఉత్తమ్ రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ ముషార్రఫ్ పారుఖీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాసర జోన్‌లోని ఎక్సైజ్ శాఖలో పదోన్నతులు కల్పించాలన్నారు. అలాగే చెక్‌పోస్టులలో సౌకర్యాలు కల్పించాలని కోరితే సానుకూలంగా స్పందించారని చెప్పారు.

రోడ్లన్నీ జలమయం



కామారెడ్డి టౌన్: రెండు రోజుల పాటు కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. జిల్లా కేంద్రంలో ప్రధాన రోడ్లతో పాటు లోతట్టు ప్రాంతాలు చెరువు, కుంటలను తలపించాయి. టీచర్స్ కాలనీ, అయ్యప్పనగర్, రుక్మిణీకుంట, బతుకమ్మకుంట, రాజానగర్ తదితర కాలనీల్లో ఇళ్ల ముందు నీరు నిలిచిపోయాయి. రామారెడ్డి రోడ్డులో రాకపోకలకు అంతరాయం కలిగింది. మురికి కాలువలు లేకపోవడంతో సిరిసిల్ల రోడ్డు, పోలీస్ స్టేషన్ ముందు వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు, ప్రయాణికులు, స్థానిక వ్యాపారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. పట్టణ శివారులో పంట పొలాలు వర్షపు నీటితో మునిగిపోయాయి.



వెలుగులు నింపుతున్నది సీఎం కేసీఆరే

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్
- ఎల్లారెడ్డిలో బీసీ బంధు చెక్కుల పంపిణీ



ఎల్లారెడ్డిలో బీసీ కుల వృత్తుల వారికి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి: సీఎం కేసీఆర్ అందరి జీవితాలలో వెలుగులను నింపుతున్నారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందేందుకు పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. బీసీలకు కులవృత్తుల వారికి రూ.లక్ష , దళితులకు రూ.10 లక్షలు అందిస్తున్నారని గుర్తు చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మొదటి విడతలో 300 మంది బీసీలకు సాయం చేశామని, రెండో విడతలో మరో 300 మందికి ఇస్తామని చెప్పారు. కుల వృత్తుల చెక్కుల కోసం ఎవరు కూడా కార్యకర్తలకు డబ్బులను ఇవ్వవద్దని అన్నారు. ఎవరైనా కార్యకర్తలకు డబ్బులు ఇచ్చినట్లు తెలిస్తే వారికి సంబంధించిన చెక్కును తిరిగి తీసుకుంటామని అన్నారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, గాంధారి, సదాశివనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు సాయిరెడ్డి, సత్యంరావు, నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్, సూపరింటెండెంట్ రేవంత్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, తదితరులున్నారు.

సొంతగూటికి నేరెల్ సర్పంచ్ భర్త

ఎల్లారెడ్డి: గాంధారి మండలంలోని నేరెల్ సర్పంచ్ భర్త సాయిలు సోమవారం ఎమ్మెల్యే సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈనెల 1న సాయిలు బీఆర్ఎస్ పార్టీని వీడి పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మదన్‌మోహన్ మాటలకు మోసపోయి కాంగ్రెస్‌లో చేరానని సాయిలు అన్నారు.

వంతెనల నిర్మాణానికి రూ. 37.3 కోట్లు

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

నిజాంసాగర్(జుక్కల్): అంతరాష్ట్ర రహదారులతో పాటు జిల్లా, మండల సరిహద్దు ప్రాంత రహదారులు, వంతెనల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.37.32 కోట్లు మంజూరు చేసిందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే తెలిపారు. సోమవారం బిచ్కుందలో ఆయన మాట్లాడారు. జుక్కల్ మండలం సోపూర్ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు రోడ్డు నిర్మాణానికికు రూ. 2 కోట్లు, చండేగాం నుంచి మహరాష్ట్ర సరిహద్దు వరకు రూ.2 కోట్లు, గుండూర్ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు రూ.1.4 కోట్లు, శక్తినగర్ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రూ.1.5 కోట్లు, చండేగావ్ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు రూ. కోటి, మద్నూర్ మండలంలోని గోజేగావ్ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు రూ.1.4 కోట్లు, పెద్ద శెక్కర్గ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు రూ.1.8 కోట్లు, హండెకేలూర్ నుంచి భక్తాపూర్ వరకు రూ.2.5 కోట్లు, తడ్గూర్ జెడ్పీ రోడ్డు నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు రోడ్ల నిర్మాణానికి రూ. 80 లక్షలు మంజూరు అయ్యాయని చెప్పారు. అలాగే పంచాయతీరాజ్ కింద బ్రిడ్జిల నిర్మాణానికి రూ.13.6 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. బిచ్కుంద మండలంలోని హస్గుల్, కిష్టాపూర్ రోడ్డుకు రూ.5.4 కోట్లు, మద్నూర్ మండలంలోని పెద్ద తడ్గూర్, కొడిచిర మధ్యన రోడ్డుకు రూ. 1.2 కోట్లు, నిజాంసాగర్ మండలంలోని గున్కుల్ గ్రామ శివారులో వాగుపైన వంతెన నిర్మాణానికి రూ. 6 కోట్లు, కొమలంచ, గాలీపూర్ గ్రామాల మధ్యన వంతెనకు రూ. కోటి మంజూరు అయ్యాయన్నారు. అలాగే బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 9.7 కోట్లు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జుక్కల్ మండలం దోస్త్‌పల్లిలో జగద్గురు నరేంద్ర మహరాజ్‌ను సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా మూడో సారి ఎన్నికల్లో పోటీ చేస్తున్న సందర్భంగా ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్



ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పరిష్కారానికి కృషి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 24 వినతులు వచ్చాయి. వాటిలో 15 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ సమస్యలవే కావడం గమనార్హం. మిగితా ఫిర్యాదులు ఆయా శాఖలకు చెందినవి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకూడదన్నారు. ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. డీఆర్‌డీవో సాయన్న, కలెక్టరేట్ పాలనాధికారి సయ్యద్ మసూద్ అహ్మద్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇరవై ఏడేళ్ల తర్వాత కలిసిన బాల్యమిత్రులు



మాచారెడ్డి ఉన్నత పాఠశాలలో కలుసుకున్న 1995-96 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు

మాచారెడ్డి: ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్నారు.. ఆడుకున్నారు. మళ్లీ 27 ఏళ్ల తర్వాత ఆ చదువులమ్మ ఒడిలోనే కలుసుకొని అప్పటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఒరేయ్ బాగున్నావా? ఒసేయ్ ఎలా ఉన్నావే అంటూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. మాచారెడ్డి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1995-96వ సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో కలుసుకొని ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పుడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఆహ్వానించి సత్కరించారు.

సృజనాత్మకతకు మారుపేరు స్వర్ణలత

- వైజ్ఞానిక ప్రదర్శనలపై విద్యార్థులకు ఆసక్తి కలిగిస్తూ..
- ఎన్నో ఆవిష్కరణలు చేయించిన ఉత్తమ ఉపాధ్యాయురాలు



తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ వద్ద విద్యార్థులతో స్వర్ణలత

మాచారెడ్డి: నూటికో..కోటికో ఒక్కరు..ఎప్పుడో ఎక్కడో పుడతారు.. అన్నట్టుగా ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తనదైన శైలిలో వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. పాల్వంచ మండలం ఇసాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు స్వర్ణలత విద్యార్థుల అభ్యున్నతి కోసం వైజ్ఞానిక ప్రదర్శనలకు శిక్షణనిస్తూ వారిని పరిశోధనల వైపు మళ్లిస్తోన్నారు. ఎక్కడ సైన్స్ ఫెయిర్‌లు జరిగినా పాఠశాల నుంచి విద్యార్థులు వెళ్లాల్సిందే అన్నట్టుగా ఆమె ప్రదర్శనలను తయారు చేయించి అక్కడికి తీసుకువెళ్తున్నారు. అనేక అంశాలపై ఆమె గైడ్‌గా రూపొందించిన ప్రదర్శనలతో విద్యార్థులు ఎన్నో ప్రశంసలు అందుకున్నారు. పదేళ్లుగా ఆమె వద్ద నేర్చుకున్న విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎన్నో అవార్డులు పొందారు. 2021లో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డులను అందుకున్నారు. విద్యార్థులను తీర్చిదిద్దుతున్న స్వర్ణలతను గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులే కాకుండా ఉపాధ్యాయులు కూడా అభినందిస్తున్నారు.

భవిష్యత్ తరాలకు మార్గదర్శి తమ్మల రాజు

- నేడు రాష్ట్ర స్థాయి అవార్డు అందుకోనున్న ఉపాధ్యాయుడు
- తుజాల్‌పూర్ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు



తమ్మల రాజు తయారు చేయించిన ప్రయోగంతో విద్యార్థులు

బీబీపేట: ప్రకృతిలోని రహస్యాలు తెలుసుకోవడానికి ఎందరో శాస్త్రజ్ఞులు నిర్విరామంగా కృషి చేసి మనకు అందించిన విజ్ఞాన శాస్త్రాన్ని భవిష్యత్ తరాలకు అందించే వారు ఉపాధ్యాయులు. అలాంటి వారిలో విద్యార్థులకు సృజనాత్మక మెలకువలతో పాటు ఫిజికల్ సైన్సు మెలకువలు నేర్పుతూ విద్యార్థులను ఎన్నో పరిశోధనలతో ముందుకు నడిపిస్తున్న ఉపాధ్యాయుడు తమ్మల రాజు. విద్యార్థులకు అందించే సేవలకు గానూ రాష్ట్ర విద్యా శాఖ నేడు ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆయనను ఎంపిక చేసింది. నేడు హైదరబాద్‌లో అవార్డును అందుకోనున్నారు. తమ్మల రాజు బీబీపేట మండల తుజాల్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. విజ్ఞాన శాస్త్రం అనేది చైతన్యవంతమైన నూతన అనుభవాలు పరిశోధనలతో నిండి ఉండే జ్ఞాన రాశి. దీంట్లో విద్యార్థులను శాస్త్రీయమైన ఆలోచనల వైపు తీసుకెళ్తుందని రాజు అన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో ఫిజికల్ సైన్స్ పట్ల ఉండే భయాన్ని తొలగిస్తూ తన బోధనని పూర్తిగా ప్రయోగాల ద్వారా, క్షేత్ర పర్యటన ద్వారా నేర్పిస్తుంటారు. విజ్ఞాన శాస్త్రం అంటే పిల్లలు ఆసక్తి పెంచే విధంగా పాఠాలు చెబుతారు. ఇటీవల నిర్వహించిన అంతరిక్ష వీక్షణ కార్యక్రమంలో పాల్గొని గ్రహాలు, ఉపగ్రహాలు వివిధ నక్షత్ర మండలాల గురించి టెలిస్కోప్‌ల ద్వారా వివరించారు. 2017లో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో వాహనాలు ప్రమాదాలకు గురైనప్పుడు వాటికి ఆస్తి, ప్రాణ నష్టం నివారించడానికి రూపొందించిన సేఫ్టీ కార్ నమూనా వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికై ప్రశంసా పత్రం పొందింది.

అలాగే 2018లో విద్యార్థులకు సైన్స్ ఫెయిర్లలో నమూనాల రూపకల్పనలో మార్గదర్శనం చేయడమే కాకుండా రోజువారి బోధనాభ్యాసన కృత్యాలకు సంబంధించి తయారు చేసిన బోధనాభ్యాసన సామాగ్రి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఇలా ఇప్పటికే ఈయన తయారు చేసిన చాలా పరిశోధనలు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికై ఎన్నో అవార్డులను పొందారు. 2009లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2019లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2021 లయన్స్ క్లబ్ వివేకానంద వారిచే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2022లో రోటరీ క్లబ్ అవార్డు, 2022లో లయన్స్ క్లబ్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2022లో రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి చేతుల మీదుగా ఇన్‌స్పైరింగ్ టీచర్ పురస్కారం వచ్చాయి.

పెరాలసిస్ వచ్చినా విద్యా బోధన



రిటైర్డ్ ఉపాధ్యాయుడు మారుతి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని వడ్లం గ్రామానికి చెందిన బుజప్ప మారుతి 1993లో ఉపాధ్యాయుడిగా బిచ్కుందలో జాయిన్ అయ్యారు. 2014లో రిటైర్డ్ అయిన తర్వాత పెరాలసిస్ వచ్చింది. అయినా పిల్లలకు విద్యను అందించాలనే ఉద్దేశంతో, ఉత్సాహంగా ముడు సంవత్సరాలుగా తన సొంత గ్రామం వడ్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హిందీ బోధిస్తున్నారు. విద్యార్థులకే కాకుండా జూనియర్ ఉపాధ్యాయులకు కూడా విద్యా బోధన ఎలా చేయాలో నేర్పేవారని స్థానిక ఉపాధ్యాయులు తెలిపారు.

మా మంచి మాస్టారు శంకర్

- విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన
- వివిధ అంశాలపై ఫీల్డ్ విజిట్ చేయించి అవగాహన కల్పిస్తున్న వైనం
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక



పోచారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న శంకర్

బాన్సువాడ: తరగతి గదిలో కూర్చొని పాఠాలు బోధించడమే కాకుండా స్వయంగా విద్యార్థులను ఫీల్డ్ విజిట్ చేయించి పలు అంశాలపై విద్యార్థులకు అర్థమయ్యే విధంగా అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు శంకర్, విద్యార్థులతో మా మంచి మాస్టారు అనే పేరు తెచ్చుకుంటున్నారు. బాన్సువాడ మండలం పోచారం ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న శంకర్ ప్రభుత్వం అందజేస్తున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు ఎంపికయ్యారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో 94 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు పాఠాలు పూర్తి స్థాయిలో అర్థమయ్యేలా వస్తువుల రూపంలో, ప్రకృతిని అనుసంధానం చేస్తూ పాఠాలు బోధిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉండే విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థులను స్వయంగా పంట పొలాల్లోకి తీసుకెళ్లి వ్యవసాయం, ప్రకృతి గురించి వివరిస్తారు. టీఎల్ఎం(టీచర్ లెర్నింగ్ మెటీరియల్) బోధనాలు-ప్రమాణాలు అనే అంశం అవశ్యకతపై సలహాలు, సూచనలు అందిస్తారు. పాఠశాలలో అటెండర్ లేకపోవడంతో నలుగురు ఉపాధ్యాయులు సొంతంగా వేతనం ఇచ్చి అటెండర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. క్రమం తప్పకుండా మధ్యాహ్న భోజన అమలుపై దృష్టి సారిస్తున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రపై అవగాహన కల్పిస్తున్నారు. శంకర్ పనితనం చూసి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు. నేడు జిల్లా కలెక్టర్, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిల చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

గురుకుల క్రీడాకారులకు ఘన స్వాగతం

మోపాల్: చైనాలో గత నెల 29 నుంచి సెప్టెంబర్ 3 వరకు జరిగిన ఏషియన్ జూనియర్ అండర్-18 ఉమెన్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన జిల్లా గురుకుల క్రీడాకారులకు సోమవారం ఘన స్వాగతం పలికారు. డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి కళాశాలలో క్రీడాకారులు లకావత్ రాణి (సుద్దాపల్లి), అజ్మీర ఇందు (ఆర్మూర్)కు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు భారత జట్టులో రాణించడంపై సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఒలింపిక్ స్థాయిలో ఎదిగేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతామని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ గోదావరి మాట్లాడుతూ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అకాడమీ సుద్దపల్లిలో విజయవంతంగా కొనసాగుతుందన్నారు. ఇప్పటివరకు భారత జట్టుకు 15 మంది ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. ప్రధానకార్యదర్శి మర్కంటి గంగామోహన్, ఆర్మూర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ధనవేని, జిల్లా స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ నీరజరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి వాణి, వనిత, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు నల్లూరి లత, మమత, స్వప్న, అకాడమీ కోచ్‌లు మౌనిక, నరేష్ పాల్గొన్నారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



నిజామాబాద్ రూరల్: స్వామి వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని రామకృష్ణ మఠం ఉపాధ్యక్షుడే శితికంఠానంద మహరాజ్ అన్నారు. మండలంలోని కాలూర్‌లో స్వామి వివేకానంద సేవా బృందం, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివేకానంద విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, గుండారం సర్పంచ్ లక్ష్మణ్‌రావు, నుడా డైరెక్టర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మృతదేహం లభ్యం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ ఊర చెరువులో గ్రామానికి చెందిన కటిక హుస్సేన్ మృతదేహం సోమవారం లభ్యమైంది. కటిక హుస్సేన్ మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఖాళీగా తిరిగేవాడు. శనివారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లడంతో కుటుంబీకులు గాలించారు. చెరువు కట్టపై సెల్‌ఫోన్, చెప్పులు కన్పించాయి. దీంతో చెరువులో గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం మృతదేహం చెరువులో తేలడంతో పోలీసులు పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్రాసుపత్రికి తరలించారు.

పలువురి అదృశ్యం

మోపాల్: మండలంలోని సిర్‌పూర్‌కు చెందిన గుమ్ముల భాగిర్థి అదృశ్యమైనట్లు ఎస్సై రాము తెలిపారు. భాగిర్థి బీడీలు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 2న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. ఆమె కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

నగరంలో యువకుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాజులపేట్‌కు చెందిన ఆకుల దేవేందర్(19) అదృశ్యం అయినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు తెలిపారు. దేవేందర్ హైమదీ బజార్‌లోని గిఫ్ట్ షాప్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 4 నుంచి కనిపించడం లేదు. తల్లి మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బాలిక..

బోధన్‌రూరల్: ఉమ్మడి బోధన్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేశామన్నారు.

సదాశివనగర్‌లో చైన్ స్నాచింగ్

సదాశివనగర్: సదాశివనగర్‌లో జాతీయ రహదారి పక్కన గల చెలిమెల యాదగిరి ఇంట్లో కిరాణ దుకాణం నడిపిస్తున్న వ్యాపారి భార్య లక్ష్మి మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పుస్తెల తాడు లాక్కెళ్లారు. మాస్కులు ధరించి ద్విచక్ర వాహనంపై దుకాణానికి సిగరెట్ల కోసం వచ్చి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

టైరు పేలడంతో ఢీకొన్న కార్లు



ప్రమాదంలో ధ్వంసమైన కారు

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు టైరు పేలడంతో వెనక నుంచి వస్తున్న మరో మూడు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు.. హైదరాబాద్‌కి చెందిన జబ్బార్ కారు టైరు పేలడంతో డివైడర్‌ని ఢీకొని ఆగిపోయింది. వెనక నుంచి వస్తున్న మెట్‌పల్లికి చెందిన శ్రీనివాస్, నిజామాబాద్‌కి చెందిన వరుణ్ అప్రమత్తమై తమ కార్లను అదుపు చేయగా వారి వెనక వస్తున్న మెట్‌పల్లికి చెందిన పవన్ ముందు ఉన్న వరుణ్ కారును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాలేదు. వరుణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

ఇంకుడుగుంతలో పడి ఒకరి మృతి

రాజంపేట: ఇంకుడుగుంతలో పడి ఒకరు మృతి చెందిన ఘటన రాజంపేటలో చోటు చేసుకుంది. ఎస్సై సంపత్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నల్ల మల్లేశం (51) ఆదివారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత వద్ద కాళ్లు చేతులు కడుక్కుంటూ కాలు జారి గుంతలో పడ్డాడు. తల్లి శారద భయంతో చుట్టు పక్కల వారిని పిలిచింది. వారు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. తల్లి శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పేద కుటుంబం కావడంతో మల్లేశం అంత్యక్రియలను సర్పంచ్ ఆముద సౌమ్య నాగరాజు దంపతులు తమ సొంత ఖర్చులతో నిర్వహించారు.

కల్లుబట్టీలో అనుమానాస్పదంగా ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని నాగారం కెనాల్ కట్ట ప్రాంతంలో గల పాత కల్లుబట్టీలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందారు. కాలనీకి చెందిన శ్యామ్ (35) మద్యం తాగేందుకు ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో కల్లు బట్టికి వెళ్లాడు. శ్యాం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా కల్లు బట్టిలో బోర్ల పడి మృతి చెంది ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఐదో టౌన్ పోలీసులకు సమాచారం అందించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

బోధన్‌రూరల్: బోధన్ మండలం నాగంపల్లి శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ సోమవారం పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక టిప్పర్‌ను బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేశారు.